సమస్యల వలయంలో బెస్త వీధి



ఈ చిత్రంలో వ్యక్తి పేరు వేణుస్వామి. బెస్త వీధిలో నడుచుకుంటూ వెళ్తుండగా జారి కిందపడి గాయపడ్డాడు. రోడ్డు మధ్యలో ఉన్న పైప్‌లైన్ దెబ్బతిని నీరు లీకవడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ వారంలోనే ఆరుగురు ఇలా జారిపడి గాయపడ్డారు. అధికారులు స్పందించి పైప్‌లైన్ మరమ్మతులు చేయాలని కాలనీ వాసులు కోరారు.



సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేస్తున్న బెస్త కాలనీ మహిళలు



పైప్‌లైన్ లీకేజీలను చూపుతున్న కాలనీవాసులు



డ్యామేజీ అయిన పైప్ లైన్

- తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ సమస్యలతో కాలనీవాసుల సతమతం
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- ఆందోళనకు దిగిన మహిళలు

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని బెస్త కాలనీ సమస్యల వలయంలో చిక్కుకుంది. తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, పైప్‌లైన్‌లు వంటి సమస్యలతో కాలనీ వాసులు ఇక్కట్లు పడుతున్నారు. కాలనీలో సుమారు 1200 ఇళ్లు ఉన్నాయి. 25 రోజులకు ఒకసారి కూడా సక్రమంగా నీటిని వదలడం లేదు. పైప్‌లైన్‌లు లీకేజీ అవుతున్నాయి. కొన్ని చోట్ల పైప్‌లైన్‌లు పూర్తిగా దెబ్బతిన్నాయి. మరి కొన్ని చోట్ల పైప్‌లైన్‌లు కట్ అయ్యాయి. దీంతో 20-25 రోజులకు ఒకసారి తాగునీటిని వదిలినా ఎలాంటి ప్రయోజనం లేదు. ఎందుకంటే పైప్‌లైన్‌లు కట్ కావడం, డ్యామేజీ కావడంతో నీళ్లన్నీ రోడ్ల పాలవుతున్నాయి. అదీగాక పైప్‌లైన్‌లు నడి రోడ్డుపై ఉండటంతో జనాలు జారి కింద పడుతున్నారు. వారంలో ఆరుగురు కింద పడి గాయాలపాలయ్యారు. ఎంఆర్ గోపాల్, వేణుస్వామి, రాకేష్, అరుణ్‌తో పాటు మరో ఇద్దరు పైప్‌లైన్‌లు తగిలి గాయపడ్డారు.

పేరుకుపోయిన చెత్త

డ్రైనేజీ సమస్య దారుణంగా ఉంది. అసలు కొన్ని సందుల్లో డ్రైనేజీ కాలువలే లేవు. మురికి నీరంతా రోడ్లపై ప్రవహిస్తోంది. చెత్త వాహనాలు అసలు రావడం లేదు. చెత్త పేరుకుపోయింది. కాలనీ వాసులే ఊరు బయటకు తీసుకెళ్లి చెత్తను పడేస్తున్నారు. కనీసం పారిశుద్ధ్య కార్మికులు రావడం లేదు. చెత్తను తీసుకెళ్లడం లేదు. కాలనీవాసులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. కొందరు తాగునీటిని కొనుక్కుంటున్నారు. ఇంత జరుగుతున్నా మున్సిపల్ అధికారులు కాని, వాటర్ వర్కర్స్ సిబ్బంది కాని పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు మంగళవారం ధర్నా చేశారు. ఈ విషయమై కమిషనర్ జబ్బార్‌మియాను సాక్షి వివరణ కోరగా కాలనీలో సమస్యలు తన దృష్టికి రాలేదన్నారు.

తాగునీరు కొంటున్నాం



మున్సిపల్ అధికారులు 25 రోజులకు ఒకసారి కూడా తాగునీటిని సరఫరా చేయడం లేదు. దీంతో తాగునీటిని కొనుక్కుంటున్నాం. తాగునీటి సమస్యను పరిష్కరించడానికి మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలి.

–ఓబుళమ్మ, బెస్త కాలనీ

పైప్‌లైన్లు పగిలిపోయాయి



వారం క్రితం పైప్‌లైన్‌లు పగిలిపోయాయి. మున్సిపల్ అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు. తాగునీటి కొరకు ఇబ్బందులు పడుతున్నాం. వేరే కాలనీలకు వెళ్లి తాగునీటిని తెచ్చుకుంటున్నాం. సమస్య పరిష్కరించాలి

–శ్రీదేవి, బెస్తకాలనీ

జారి పడుతున్నారు



రోడ్ల మధ్యలో పైప్‌లైన్‌లు ఉండటం వల్ల జనాలు జారి కింద పడి గాయాలపాలు అవుతున్నారు. పైప్‌లైన్‌లు డ్యామేజీ కావడంతో పాటు కొన్ని చోట్ల కట్ అయ్యాయి. అనేక సమస్యలతో సతమతం అవుతున్నాం.

–మస్తానమ్మ, బెస్త కాలనీ

క్లుప్తంగా

బదిలీ అధికారులకు సన్మానం



ఈఓఆర్డీ విజయశేఖర్ నాయుడును సన్మానిస్తున్న సర్పంచులు

యల్లనూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పనిచేసి ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన అధికారులకు సర్పంచుల ఆధ్వర్యంలో మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఘనంగా సన్మానసభను ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ వీరరాజు, ఈఓఆర్డీ విజయశేఖర్‌నాయుడు, సీనియర్ అసిస్టెంట్ దాదా ఖలందర్, జూనియర్ అసిస్టెంట్ రాఘవ, పంచాయతీ కార్యదర్శులు గీత, ఉమాదేవి, కృష్ణవేణి, గంగాదేవి, సుజాత, అబిదుల్లాను శాలువా, పూలమాలలతో సత్కరించారు. జెడ్పీటీసీ సభ్యుడు భోగతి ప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ గంగాదేవి, తిరుమలాపురం, వేములపల్లి, మేడికుర్తి, చిలమకూరు, కూచివారిపల్లి, యల్లనూరు, జంగంపల్లి సర్పంచులు రామాంజులరెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, పెద్దనాగరాజు, నారాయణస్వామి, ఓబులమ్మ, కుళ్లాయప్పనాయుడు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వాసుదేవరెడ్డి, వైద్యులు లోకేష్, ఏపీఓ షబ్బీర్‌బాషా, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'డీలర్లపై చర్యలు తీసుకోండి'

యాడికి: 'మండల వ్యాప్తంగా పలువురు స్టోర్ డీలర్లు రేషన్ కార్డుదారులకు కంది బేడలు ఇవ్వడం లేదు. విచారణ చేసి సంబంధిత స్టోర్ డీలర్లపై చర్యలు తీసుకోవాలి' అని శ్రీరంగ హనుమాన్ భజన మండలి అధ్యక్షుడు చంద్రశేఖర్‌రాయల్ మంగళవారం తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. కందిబేడలు వేయాలని రేషన్ కార్డుదారులు కోరినా స్టోర్ డీలర్లు స్పందించడం లేదన్నారు. కొందరు డీలర్లు కందిబేడలు వేసేది లేదని ఖరాఖండిగా చెబుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

మాలధారులకు భిక్ష ఏర్పాటు



మాలాధారులకు అన్నదానం చేస్తున్న కె.రమేష్‌రెడ్డి

తాడిపత్రి అర్బన్: స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప, శివ మాలధారులకు మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొనుదుల రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఏటా 45 రోజుల పాటు మాలాధారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మంగళవారం స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని రమేష్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మరొకరికి సాయం చేసి తోడ్పాటు అందించినపుడే మానవ జన్మకు, దీక్ష తీసుకున్నందుకు సార్థకత చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో సుమారు 600 మంది అయ్యప్ప, శివమాలధారులు పాల్గొన్నారు.

హిటాచీ, టిప్పర్ సీజ్

శింగనమల: మండలంలోని సలకంచెరువు వద్ద వంకలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌తో పాటు ఇసుకను తోడేందుకు ఉపయోగిస్తున్న హిటాచీని పోలీసులు సీజ్ చేశారు. అందిన సమాచారంతో మంగళవారం తెల్లవారుజామున శింగనమల ఎస్‌ఐ శరత్‌చంద్ర, సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో వంకలో హిటాచీ సాయంతో అక్రమంగా ఇసుక తోడి టిప్పర్ల ద్వారా తరలిస్తున్నట్లుగా గుర్తించారు. అక్కడే ఉన్న హిటాచీతో పాటు ఓ టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. వాహనాలను సీజ్ చేసి, బాధ్యులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సుబ్బరాయసాగర్ నుంచి నీరు విడుదల



నీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే శ్రావణి

పుట్లూరు: మండలంలోని సుబ్బరాయసాగర్ నుంచి మంగళవారం ఎమ్మెల్యే బండారు శ్రావణి చెరువులకు నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని పుట్లూరు, కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి చెరువులను తాగునీటి అవసరాల కోసం పూర్తిగా నింపుతామన్నారు. నీటి సరఫరా సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా కాలువల్లో పూడిక తీత చేపట్టామన్నారు. అనంతరం స్థానిక టీడీపీ నాయకులతో మండల సమస్యలపై ఆమె ఆరా తీశారు. టీడీపీ మండల కన్వీనర్ బాలరంగయ్య, నాయకులు సుదర్శననాయుడు, చవ్వా కులశేఖర్‌రెడ్డి, శ్రీపతి నాయుడు, అధికారులు పాల్గొన్నారు.

పరామర్శ

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని ఐలమ్మ కాలనీలో హెచ్ఎల్‌సీ కెనాల్ కాలువలో గల్లంతైన విద్యార్థి మోహన్‌సాయి కుటుంబాన్ని సీపీఐ జిల్లా నాయకులు జగదీష్ మంగళవారం పరామర్శించారు. మూడు రోజులు కావస్తున్నా ప్రభుత్వం బాలుని ఆచూకీ కనుక్కోలేక పోవడం దారుణమన్నారు. ఏపీ చేతి వృత్తుల సమాఖ్య కార్యనిర్వాహక అధ్యక్షులు లింగమయ్య, హరిక్రిష్ణ, భూషణ, చిన్న నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

హనుమద్ వ్రతం ఉత్సవ నిర్వహణపై నేడు సమీక్ష

గుంతకల్లు రూరల్: హనుమద్ వ్రతం మండల దీక్షలు ముగియనున్న నేపథ్యంలో ఈనెల 12న వేలాది మంది మాలధారులతో శోభాయాత్ర, 13వ తేదీ నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో హనుమద్ వ్రతం పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఉత్సవాల నిర్వహణలో భాగంగా బుధవారం 11 గంటలకు ఆలయ సమీపంలోని రామదూత నిలయంలో ఆర్డీఓతో కలసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఈఓ కె.వాణి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

జిల్లా జైల్లో 6న వేరుశనగ చెక్క వేలం

బుక్కరాయసముద్రం: మండలంలోని జిల్లా జైల్లో ఈ నెల 6న 25,000 కేజీల వేరుశనగ చెక్కకు వేలం నిర్వహించనున్నట్లు సూపరింటెండెంట్ రహ్మాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాంతీయ జైళ్ల ఉపశాఖ అధికారి సమక్షంలో వేలం నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనేవారు రూ.20,000 డిపాజిట్ చెల్లించాలన్నారు. వేలం అనంతరం డిపాజిట్ వెనక్కు చెల్లిస్తామన్నారు.

త్రాసులపై ముద్ర వేయించుకోవాలి

యాడికి: వ్యాపారులు ఎలక్ట్రానిక్ త్రాసులపై ముద్ర వేయించుకోవాలని, లేకుంటే లీగల్ మెట్రాలజీ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని తూనికలు కొలతల ఇన్‌స్పెక్టర్ శంకర్ హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన వ్యాపారులు వాడే 103 ఎలక్ట్రానిక్ త్రాసులను సరిచేసి ముద్రలు వేశారు. మండలంలోని పిన్నేపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తొమ్మిది ప్యాకెట్ల బియ్యాన్ని ఆటోలో తీసుకుపోతుండగా.. ప్యాకెట్ ఉన్నట్టు కాకుండా తూకం తక్కువ ఉండడంతో అతడికి రూ.5 వేలు అపరాధ రుసుం విధించారు.

మాట తప్పిన కూటమి ప్రభుత్వం



గుంతకల్లులో ఏడీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు



గుత్తిలో ట్రాన్స్‌కో అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

గుంతకల్లు: అధికారంలో వస్తే విద్యుత్ చార్జీలను పెంచమని, ఇప్పుడు సర్దుబాటు చార్జీల పేరుతో విద్యుత్ చార్జీలను భారీగా పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నారని సీపీఐ నాయకులు మండిపడ్డారు. మంగళవారం స్థానిక ఆలూరు రోడ్డులోని ఏడీ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి ఎం.వీరభద్రస్వామి, మండల, పట్టణ కార్యదర్శులు రాముడు, రాయల్, గోపీనాథ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులపై దాదాపు రూ.15,485 కోట్ల అదనపు భారం మోపుతుందని ఆరోపించారు. ప్రతి పక్షంలో ఉన్నప్పుడు కూటమి నాయకులు విద్యుత్ చార్జీలపై గగ్గోలు పెట్టి ఇప్పుడు అధికారం వచ్చిన తరువాత మాట తప్పారని విమర్శించారు. సర్దుబాటు చార్జీలను కూటమి ప్రభుత్వం విరమించుకోకపోతే అన్ని రాజకీయ పార్టీలను కలుపుకుని పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గురుస్వామి, దండు గోవిందు, నాగరాజు, సూర్యనారాయణ, ఏఐటీయూసీ నాయకులు ఈశ్వరయ్య, ఏఐఎస్ఎఫ్ నాయకుడు వెంకట్‌నాయక్, ఏఐవైఎఫ్ నాయకుడు వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి.

గుత్తి: పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నాయకులు, కార్యకర్తలు గుత్తిలోని ట్రాన్స్‌కో డీఈ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా చేపట్టారు. మండల కార్యదర్శి రామదాసు, పట్టణ కార్యదర్శి రాజు యాదవ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రా అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రమేష్, నరసింహయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపు దుర్మార్గం

గార్లదిన్నె: ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం వేయడం దుర్మార్గమని ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనాథ్ చౌదరి మండిపడ్డారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పిన చంద్రబాబు..పై సర్దుబాటు ఛార్జీల పేరుతో రూ.9412 కోట్లు ప్రజలపై భారం వేయడం తగదన్నారు. ప్రభుత్వం అసమర్థత విధానాలు వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటును వ్యతిరేకించి, అధికారంలోకి వచ్చిన వెంటనే వ్యవసాయ పంపు సెట్లు, గృహ వినియోగదారురు, పరిశ్రమలకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో రామక్రిష్ణ, నారాయణ స్వామి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు అండ



మృతుల కుటుంబ సభ్యులకు భోజనాలు అందిస్తున్న లగినేని సోదరులు

పుట్లూరు: రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలకు లగినేని సోదరులు అండగా నిలిచారు. గత నెల 23న గార్లదిన్నె మండలం తలగాసిపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పుట్లూరు మండలం ఎల్లుట్ల గ్రామానికి చెందిన ఎనిమిది మంది మృతి చెందిన విషయం విదితమే. ప్రమాదం నుంచి మృతుల కుటుంబాలు ఇప్పటికీ కోలుకోలేకపోతున్నారు. వారి పరిస్థితిని గమనించిన లగినేని వెంకటస్వామి, లగినేని క్రిష్ణయ్య, లగినేని నాగరాజు గత నెల 24 నుంచి ఈ నెల 3వ తేదీ వరకూ 10 రోజుల పాటు ఉదయం అల్పాహారంతో పాటు మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో భోజనాలను అందించారు. వెంకటస్వామి అనంతపురంలో వ్యాపారం చేస్తుండగా క్రిష్ణయ్య, నాగరాజు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. వృత్తి, వ్యాపారాల రీత్యా ఇతర ప్రాంతాల్లో ఉన్నప్పటికీ తమ గ్రామానికి చెందిన మృతుల కుటుంబాలకు అండగా నిలవడంపై సర్పంచ్ లక్ష్మీదేవి, గ్రామస్తులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

బెల్టుషాపులపై ఎక్సైజ్ పోలీసుల దాడి



గార్లదిన్నెలో అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తి నుంచి ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు, ద్విచక్రవాహనం

గార్లదిన్నె: బెల్టుషాపులపై ఎక్సైజ్ పోలీసుల దాడి చేశారు. ఊరూరా బెల్ట్ జోరు అనే శీర్షికన సాక్షిలో మంగళవారం ప్రచురితమైన కథనానికి ఎక్సైజ్ అధికారులు గార్లదిన్నె, బుక్కరాయ సముద్రం మండలాల్లో దాడులు నిర్వహించారు. బెల్టు షాపు నిర్వహించే ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు బుక్కరాయసముద్రం ఎక్సైజ్ సీఐ సునీత తెలిపారు. గార్లదిన్నె మండలం పెనకచెర్ల డ్యాంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ మహిళను అదుపులోకి తీసుకుని, ఆమె నుంచి 27 మద్యం సీసాలు, గార్లదిన్నెలో ఒక వ్యక్తి నుంచి 35 మద్యం బాటిళ్లు, ఒక ద్విచక్ర వాహనం, బుక్కరాయసముద్రం మండలం కొట్టాలపల్లిలో ఒక మహిళ నుంచి 13 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. అక్రమంగా మద్యం విక్రయిస్తే ఎంతటివారైనా సరే కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు.

సాక్షి ఎఫెక్ట్..

పెన్నానదిలో రెవెన్యూ అధికారుల పర్యటన

పామిడి: పట్టణ సమీపంలోని పెన్నానదిలో మంగళవారం రెవెన్యూ అధికారులు ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు పర్యటించారు. ఇటీవల సాక్షిలో ప్రచురితమైన యథేచ్ఛగా ఇసుక, గరుసు అక్రమ రవాణా కథనానికి తహసీల్దార్ శ్రీధరమూర్తి స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు వీఆర్వోలు ఎర్రినాగప్ప, గోపాల్‌రెడ్డి పెన్నానదిలో పర్యటించారు. పెన్నానది నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక, అలాగే గరుసు అక్రమ రవాణా చేపడితే చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం



బీకేఎస్‌లో ఫాదర్ ఫెర్రర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్డీటీ సిబ్బంది, విద్యార్థులు



యాడికిలో దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం



గుంతకల్లులో చిన్నారుల చేత కేక్ కట్ చేయిస్తున్న ఎంఈఓ సుబ్బరాయుడు

గుంతకల్లుటౌన్/గుంతకల్లు రూరల్/ పెద్దవడుగూరు/ యాడికి/ గార్లదిన్నె/ పుట్లూరు/ తాడిపత్రి/ బుక్కరాయసముద్రం/పామిడి: గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లో మంగళవారం దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. గుంతకల్లులోని స్థానిక లాల్‌బహుదూర్ శాస్త్రి మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఆవరణంలోని భవిత కేంద్రంలో నిర్వహించిన దివ్యాంగుల దినోత్సవంలో ఎంఈఓ సుబ్బరాయుడు మాట్లాడుతూ వికలత్వమనేది మనిషికే గానీ, మనస్సుకు కాదన్నారు. దివ్యాంగులకు చేయూతనందిస్తే అన్ని రంగాల్లో రాణిస్తారని చెప్పారు. హెచ్ఎంలు ఖలీల్, శివప్రసాద్, ఐఈఆర్‌టీ శ్రీధర్, తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు. పెద్దవడుగూరులోని భవిత కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈఓలు రాముడు, గురుప్రసాద్, జెడ్పీ పాఠశాల హెచ్ఎం సుధాకర్‌బాబు, ఐఈఆర్‌టీలు ఆనంద్, వరలక్ష్మి, దివ్యాంగులు సంఘాల నాయకులు బయపురెడ్డి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే యాడికిలోని ఫెర్రర్ విగ్రహం వద్ద దివ్యాంగుల సేవా సంఘం ఆధ్వర్యంలో దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ వీర్రాజు, ఏపీఓ రమేష్, దివ్యాంగుల సేవా సంఘం నాయకులు నరసింహులు, కదిరప్ప నాయుడు, ఉపేంద్ర, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. గార్లదిన్నెలోని పీడబ్ల్యూకాలనీలో ఉన్న సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యాంగుల దినోత్సవంలో ఎంఈఓ-2 వెంకటరమణ నాయక్, హెచ్ఎం తిరుమలరెడ్డి ,ఉపాధ్యాయురాలు అనిత, ఈఐఈ ర్టీలు నాగర త్నమ్మ, సింధు దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. పుట్లూరు ఎమ్మార్సీలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈఓలు శ్రీదేవి ప్రేమ్‌కుమార్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఓబుళరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తాడిపత్రిలోని భవిత కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈఓ నాగరాజు, ఆర్డీటీ గ్రూప్ ఆర్గనైజర్ బాలనారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే బీకేఎస్ మండల కేంద్రంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం నిర్వహించారు. ఆర్డీటీ బధిరుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎర్రిస్వామి, ఆర్డీటీ సిబ్బంది, బధిరుల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. పామిడి భవిత కేంద్రంలో నిర్వహించిన దివ్యాంగుల దినోత్సవంలో ఎంఈఓలు జయానాయక్, సత్యనారాయణ, ఐఈఆర్టీలు ప్రసూన, జ్యోతి, దివ్యాంగ పిల్లలు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పంటల నమోదు తప్పనిసరి

శింగనమల: మండలంలో రబీ కింద సాగు చేసిన పంటలను రైతులు నమోదు చేయించుకోవాలని ఏఓ అన్వేష్‌కుమార్ సూచించారు. మంగళవారం మండలంలోని తరిమెల గ్రామంలో వ్యవసాయ సిబ్బందితో కలిసి పంట నమోదు చేపట్టారు. రైతులు రబీ కింద సాగు చేసిన పంటలను గ్రామ రైతు సేవా కేంద్రంలోని సిబ్బందితో నమోదు చేయించాలన్నారు. తద్వారా పంట నష్టం వాటిల్లితే ప్రభుత్వం నుంచి పరిహారం అందుతుందన్నారు. ఎంపీఈఓ ఆదినారాయణ , రైతులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

పుట్లూరు/పామిడి: సమగ్ర యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధ్యమని వ్యవసాయాధికారులు సూచించారు. పుట్లూరు మండలంలోని చింతకుంట గ్రామంలో మంగళవారం వ్యవసాయ అధికారి కాత్యాయని ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో సాగు చేసిన పప్పుశనగ పంటను పరిశీలించి రైతులకు పలు సూచనలు అందించారు. అనంతరం రైతు సాంబశివారెడ్డి వేరుశనగ పొలంలో పంట కోత ప్రయోగాలు నిర్వహించగా 2.85 కిలోల దిగుబడి వచ్చింది. అలాగే పామిడి మండలంలోని పీ కొండాపురం, రామరాజుపల్లి గ్రామాల్లో మంగళవారం ఏఓ లీనా వసుంధర ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు.

తాడిపత్రిలో శాంతిభద్రతలు క్షీణించాయి



బాధితులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి

తాడిపత్రిటౌన్: 'తాడిపత్రి పట్టణంలో శాంతిభద్రతలు క్షీణించాయి. రోజూ ఏదో ఒక్కచోట దాడులు, ఘర్షణలు జరుగుతున్నాయి. పలు కాలనీల్లో గంజాయిబ్యాచ్‌లు హల్‌చల్ చేస్తున్నారు' అని వైఎస్సార్‌సీపీ రాష్ట్రకార్యదర్శి కొనిదల రమేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలో నంద్యాల రోడ్డు సమీపంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు శ్రీనివాసులు, హాజీబాషాలపై దాడి సంఘటన తెలుసుకున్న ఆయన ఏరియా ఆస్పత్రికి వెళ్లి వారిని పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ నిత్యం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు జరుగుతున్నాయని, పోలీసులు కేసులు నమోదు చేయడానికి వెనుకాడుతున్నారన్నారు. కేసులు నమోదు చేసినా బాధితులపైనే కౌంటర్ కేసులు నమోదు చేసి పోలీసులు వేధిస్తున్నారన్నారు. ఎస్పీ స్థాయి అధికారులు చర్యలు తీసుకుని తాడిపత్రి ప్రాంతంలో శాంతిభద్రతలు కాపాడాలని ఆయన కోరారు.

టీడీపీ నాయకుల దాడి

తాడిపత్రి రూరల్: స్థానిక వరాలు తోట వద్ద పెన్నానదిలో మంగళవారం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు హాజీ బాషా, శ్రీనివాసులుపై టీడీపీ నాయకులు పొట్టి వేణు, గౌతం, బడేలు... రాళ్లు, కట్టెలు, మద్యం బాటిళ్లతో దాడి చేశారు. పోలీసులు తెలిపిన మేరకు ... పోరాట కాలనీకి చెందిన హాజీ బాషా, శ్రీనివాసులు మంగళవారం పెన్నానదిలో వాకింగ్‌కు వెళ్లారు. అప్పటికే నదిలో మద్యం సేవిస్తున్న టీడీపీ నాయకులు పాతకక్షలను మనసులో పెట్టుకుని దాడికి దిగారు. తీవ్రంగా గాయపడిన శ్రీనివాసులు, హాజీబాషాను స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శ్రీనివాసులు పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి వైద్యులు రెఫర్ చేశారు. క్షతగాత్రులను వైఎస్సార్‌సీపీ రాష్ట్రకార్యదర్శి కొనిదల రమేష్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. క్షతగాత్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

'ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయాలి'

తాడిపత్రి రూరల్: మండలంలోని గన్నెవారిపల్లి పంచాయతీలోని జేసీ నాగలక్షమ్మ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేయాలని మంగళవారం ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డికి స్థానికులు వినతి పత్రం అందజేశారు. టిడ్కో గృహాల పరిశీలనకు వెళ్లిన ఎమ్మెల్యేతో స్థానికులు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో 1500 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారన్నారు. వాటిలో కొన్ని ఇళ్ల నిర్మాణం పూర్తి అయ్యాయన్నారు. వేలాది మంది ఉన్న కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం లేకపోవడం వల్ల గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాల లేకపోవడం వల్ల చిన్నారులు విద్యకు దూరమవుతున్నారన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అంగన్‌వాడీ కేంద్రంతోపాటు ప్రాథమిక పాఠశాల మంజూరుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ఆటో బోల్తా.. ముగ్గురికి గాయాలు

గుత్తి: పట్టణంలోని కేంద్రీయ విద్యాలయం సమీపంలో మంగళవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుని ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. ఊటకల్లు గ్రామానికి చెందిన మహబూబ్ బాషా, రవి, చిన్న లాలెప్ప ఆటోలో రజాపురం గ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన మహబూబ్ బాషా, రవి, చిన్న లాలెప్పను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి రెఫర్ చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.